ఆ లెక్కన జూస్తే ఈ మధ్య పెళ్ళిళ్ళయిన చాలామంది ఆడపిల్లల కన్నా అందంగా వుంటుంది తన కూతురు వాణి. పోనీ చదువులేదా అంటే బొత్తిగా లేకపోలేదు.

ఇంటర్మీడియట్ పాసయింది. మరయితే ఎందుకవలేదూ అంటే తన కూతురి పెళ్ళి చెయ్యాలని కొడుకులెవ్వరూ చిత్తశుద్ధితో ప్రయత్నం చెయ్యడంలేదు. అది అనసూయమ్మగారి బాధ.

అనసూయమ్మగారి భర్త పోయి పదేళ్ళయింది. అప్పటికి వాణికి పన్నెండేళ్ళు. కొడుకులు ముగ్గురూ జీవితాల్లో స్థిరపడిపోయారు. పెద్ద కొడుకు శాస్త్రి ఏదో ప్రైవేటు కంపెనీలో కుదురుకున్నాడు. జీతం పర్వాలేదు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు.

రెండో కొడుకు శర్మకి ఒక పెద్ద గవర్నమెంటు కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఓటీలు, బోనస్‌లు చాలా జోరుగా అందుతూ వుంటాయి. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు. ఇక మూడోవాడు మూర్తి. తండ్రి పోయి నాటికి మూర్తి ఇంటరు చదువుతున్నాడు. ఆ తరువాత గజనీ, ఘోరీని ఆదర్శంగా పెట్టుకుని దీక్షగా పరీక్షకి చాలాసార్లు వెళ్ళాడు. ఆ టైమ్‌లోనే మూర్తికి పెళ్ళి సంబంధం వొచ్చింది.

మూర్తిని డిగ్రీ పాస్‌జేయించి తనే ఉద్యోగం వేయించుకుందుకుసిద్ధపడ్డాడు పిల్ల తండ్రిగారు. అయితే దాని వెనకాల కారణం లేకపోలేదు. మూర్తి కిద్దామనుకున్న పిల్ల కాస్త నల్లగా వుంటుంది. పైగా కొంచెం మెల్ల కూడా వుంది.

అనసూయమ్మగారి గుండెల్లో రాయి పడింది. ఆ పిల్లకి మెల్ల ఉన్నందుగ్గాదు— మూర్తికి పెళ్ళిచేసి ఆ వొచ్చిన కట్నం డబ్బుతో వాణి పెళ్ళి చేయించాలని ఆవిడ చాలాకాలంబట్టి ప్లాను వేస్తోంది. అయితే అందుకు విరుద్ధంగా ఇప్పుడు కట్నం కానుకల ప్రసక్తిలేని సంబంధం వచ్చిపడింది. పైగా ఈ సంబంధానికి అన్నదమ్ములు ముగ్గురూ సుముఖంగా వున్నారు కూడా!

ఇక లాభంలేదని అన్నదమ్ములు ముగ్గుర్నీ సమావేశపరచి కూతురి పెళ్ళి సమస్య లేవదీశారు అనసూయమ్మగారు.

"ఒరే పెద్దాడా! మూర్తికి వచ్చిన కట్నం డబ్బుతో వాణి పెళ్ళి చేసేస్తే బాగుంటుందని నేను చాలా రోజులబట్టి అనుకుంటున్నాను. మీ నాన్నగారా పోయాడు. నేనా బతికినంత కాలం బతకను. మీకు కూడా ఎవళ్ళ సంసారాలు వాళ్ళకి ఏర్పడుతున్నాయి. ఈ సమయంలోనే దాన్ని కూడా ఓ యింటిదాన్ని చేసి పంపించేస్తే బావుంటుంది. అందుకు డబ్బు కావాలి. కనీసం పదిహేను వేలైనా వుండాలి. ఇప్పుడు మూర్తి గాడికి కట్నంలేని సంబంధం చేస్తే ఆ తరువాత దాని పెళ్ళి చేసేటప్పుడు మీకు అంత డబ్బు సమకూర్చుకోవడం చాలా కష్టమయిపోతుంది. ఏమంటారు."

కొడుకులవైపు సాలోచనగా చూశారావిడ.

ఇబ్బందిగా కదిలేరు అన్నదమ్ములు ముగ్గురూ.

మూర్తికైతే గుండెల్లో బాంబే పడింది. తనకీ జన్మలో డిగ్రీ పూర్తవుతుందన్న నమ్మకం లేదు. అటువంటిది తనే డిగ్రీ పూర్తి చేయించి ఉద్యోగం కూడా వేయిస్తానంటున్నాడు కాబోయే మామగారు. ఆ పిల్ల నల్లగా వుంటేనేం? మెల్ల వుంటేనేం? తన కుద్యోగం వొస్తుంది గదా! పొరపాటున తనెప్పుడైనా డిగ్రీ పాసయినా ఉద్యోగం వొస్తుందన్న నమ్మకం ఏ కోశానా లేదు. అటువంటిది చెల్లెలి పెళ్ళి సాకుతో తల్లి ఈ పెళ్ళి తప్పించేస్తుందేమోననే భయం పట్టుకుంది మూర్తికి. పెద్దన్న శాస్త్రివైపు దీనంగా నీవే రక్షించాలన్నట్లుగా చూశాడు.

మిగిలిన అన్నదమ్ములిద్దరూ మూర్తి పడినంత మానసిక సంఘర్షణ పడకపోయినా మంచి పలుకుబడి కలిగిన మూర్తి మామగార్ని వదులుకోదల్చుకోలేదు వాళ్ళు.

అందుకే పెద్దకొడుకు శాస్త్రి గొంతు సవరించుకున్నాడు.

"అమ్మా! వాణి పెళ్ళి గురించి నువ్వెందుకింత భయపడుతున్నావో నా కర్థంగావడం లేదు. ముగ్గు రన్నదమ్ములం మేమున్నాం. ఏలోటు లేకుండా దాని పెళ్ళి జరిపించేస్తాం. కాని మూర్తిగాడికి ఉద్యోగం వేయించలేముగదా! కట్నం లేకపోతేనేం- చదువు పూర్తిజేయించి ఉద్యోగం వేయించే మామగారు దొరకొద్దూ! మూర్తిగాడికి కూడా ఉద్యోగం వచ్చేస్తే ఇంక వాణి పెళ్ళి చెయ్యడం ఎంత సేపు! అందుకని నువ్వు అనుమానాలేవీ పెట్టుకోకుండా ఈ పెళ్ళికి ఒప్పుకో. మిగిలిన కార్యక్రమాలన్నీ మేము జరిపిస్తాము. పైగా వాళ్ళది చాలా సంప్రదాయమైన కుటుంబం."

## అంక గణిత్వం


జీవి మీద
కాలం విసిరే చివరి 1/4
చావు.
నువ్వు 6 తున్న
దీపం అని పసికట్టి
కోరలు 100 తోంది
మృత్యువు
గుండె 1/2 ల్లో
10 లంగా దాచుకున్న
జ్ఞాపకాల్ని మరోసారి
మననం చేసుకో
ఆయువు మూడుతున్నదని
తెలిస్తే ఆగదు 7 పు
చిగుళ్ళు తొడుగుతున్న
కన్నీళ్ళని తుడుచుకో.
మృతి
వి 100000 ణమైన
అనుభూతి!
నెమరేసుకునే
అవకాశం ఇవ్వని స్మృతి.

—టి. చంద్రశేఖరరెడ్డి

### ఈ వారం సామెతలు:



చెత్తబుట్టకేం తెలుసు
కొత్త రచయిత పట్టుదల!
సినిమా షూటింగులకి కట్టిన స్టూడియో
పార్టీ మీటింగులకి నిలయమైనట్లు!



—నాన్సీ. గుడివాడ

పెద్దకొడుకు కాడిన మాటలు చాలా సబబుగా వినిపించేయి అనసూయమ్మగారికి. నిజమే! మూడోవాడికి కూడా ఉద్యోగం వచ్చేస్తే అప్పుడు డబ్బు పెద్ద సమస్య కాదు. ఈ రోజుల్లో పెళ్ళిళ్ళు చెయ్యడం కష్టం కాదు. ఉద్యోగం సంపాదించుకోవడమే కష్టం.

అప్పటికి అనసూయమ్మగారు పరిస్థితులతో అలా సమాధానపడ్డారు. ఆవిడ పూర్తి అంగీకారంతోనే మూర్తి వివాహం సలక్షణంగా జరిగిపోయింది.

ఆ తరువాత మూర్తి డిగ్రీ పాసవడం, వున్న వూళ్ళోనే ఉద్యోగం రావడం కూడా జరిగిపోయింది. మూర్తికి బల్లమీదనుంచి వచ్చే ఆదాయంకన్న బల్లకిందనుంచి వచ్చే ఆదాయం చాలా ఎక్కువ. మామగారు తన పలుకుబడినంతా ఉపయోగించి అటువంటి ఉద్యోగం వేయించేరు మరి!

ఇప్పుడు వాళ్ళది ఉమ్మడి కుటుంబం.

నెలయ్యేసరికి ముగ్గురు కొడుకులూ వాళ్ళ ఆదాయాల్లోంచి కొంత తీసి అనసూయమ్మగారి చేతికిస్తారు. దానితో ఆవిడ ఏలోటూ లేకుండా సంసారం నెట్టుకొస్తోంది. మధ్య మధ్యలో కూతురి పెళ్ళి గురించి కొడుకుల్ని కదుపుతోంది. "తొందరేముంది. ఇంకా చిన్నపిల్లే గదా" అంటూ దాటవేస్తున్నారు వాళ్ళు.

వాణి ఇంటరు పాసయింది. అదీ మామూలుగా కాదు. ఫస్టు క్లాసులో. పై చదువులు చదవాలని వాణికుంది. పెళ్ళి చేసెయ్యాలని అనసూయమ్మగారికుంది. అన్నదమ్ముల మనసుల్లో ఏముందో వాళ్ళిద్దరికీ తెలీదు.

"ఒరేయి పెద్దాడా! వాణికి పదిహేడేళ్ళు నిండేయి. ఇక పెళ్ళి చేసేస్తే బాగుంటుందిరా"

ఎలాగైనా వాణి పెళ్ళి చేసెయ్యాలనే

# మలుపు తిరిగిన వలపు

యవ్వనుల తలపులలో వలపు
వసంతాల మెఱుపు, దిగంతాల మనుపు
కుహూకుహూ రవాల కోయిలమ్మ
పిలుపు
కంటికిరాదు కునుకు
ప్రేయసి మనోజ్ఞరూపమే కనులవిందు
పెద్దల హితవు చెవికెక్కదు
ప్రియుని కులుకుల పలుకులే చెవుల
విందు
భావిజీవన గమనమే తలపరు
పెళ్ళికోసమే తపించే యీ విరహులు
కాని వలపు మలుపు తిరిగితే
యేమవుతుందో ఎరుగరు కదా వీళ్ళు!

—కె. మిథిల

పట్టుదలతో మరోసారి పెద్ద కొడుకుని కదిపేరు అనసూయమ్మగారు.

"చేద్దాంలే అమ్మా! తొందరేమొచ్చింది? వాణి ఇంకా చిన్నపిల్లేగదా!"

చేసేద్దామంటే పెళ్ళి ఖర్చంతా తనే పెట్టుకోవాలో ఏమిటో అనే భయంతో దాటెయ్యబోయాడు శాస్త్రి.

కాని అనసూయమ్మగారు ఊరుకోదల్చుకోలేదు.

మిగిలిన యిద్దరు కొడుకుల్నీ కూడా పిలిచేరు. వాళ్ళతోబాటు పిలవకుండా వాళ్ళ భార్యలూ వచ్చేసు. యంత్రాలు వాళ్ళ దగ్గరుంటే వాటి స్విచ్చిలు వాళ్ళ భార్యల దగ్గరున్నాయి మరి!

"ఏమర్రా! వాణికి పదిహేడు నిండుతున్నాయి. ఇకనైనా దానిపెళ్ళి చేస్తారా, చెయ్యరా. దాని ఈడు వాళ్ళందరికీ పెళ్ళిళ్ళయిపోతున్నాయి."

ఏదో ఒకటి తేల్చి చెప్పండన్నట్లున్నాయి అనసూయమ్మగారి చూపులు.

ఏదో వొకటి చెప్పకపోతే తల్లి ఊరుకోదు. తొందరపడి చెప్పేస్తే ఆ తరువాత పెళ్ళాలు ఊరుకోరు. ముగ్గురు మగాళ్ళు డైలమాలో పడ్డారు.

శాస్త్రి పెళ్ళానికి రవ్వల నెక్లెసుకి ఆర్డరిచ్చేడు.

శర్మ పెళ్ళాం బిడ్డలతో కాశ్మీరు టూరు వెళ్దామనుకుంటున్నాడు. దానికి కనీసం రెండు వేలైనా వుండాలి.

మూర్తి స్కూటరు కొనుక్కుందామనుకుంటున్నాడు.

ఇప్పుడు చెల్లెలి పెళ్ళి తలపెడితే వాళ్ళనుకున్న పనులేవీ చెయ్యలేరు. అందుకే తలా కాళ్ళూ ఏమీ పెట్టకుండా ఎలాగోలాగ తల్లిని మభ్యపెట్టాలనే అన్నదమ్ములు ముగ్గురూ నిశ్చయించుకున్నారు.

"చేసేద్దాములే అమ్మా! ఏదీ ఇంకా వాణికి పదిహేడేళ్ళేగా. మరో రెండేళ్ళాగితే పెళ్ళి వయసొస్తుంది. ఇది మీ కాలం కాదు కదమ్మా! ఇప్పుడు రోజులు మారిపోయాయి. మీ రోజుల్లో ఎనిమిదేళ్ళకే పెళ్ళిళ్ళు చేసేసేవారు. కాని ఇప్పుడలా కాదు. ఆడపిల్లకి ఇరవై ఏళ్ళు- మగపిల్లలకైతే ఇరవై ఎనిమిదేళ్ళు వస్తేనే గాని ఎవరూ పెళ్ళి ఊసెత్తడంలేదు. అందుకని మరో రెండేళ్ళాగి దాని పెళ్ళి చేసేద్దాం. ఈలోగా మంచి సంబంధాలేమైనా వుంటే చూస్తాం"


అప్పటికి పెళ్ళి తప్పించడమే గాకుండా సంబంధం వెతికే బాధ్యత కూడా తల్లిమీదే పెట్టారు సుపుత్రులు ముగ్గురూ!

ఎప్పటికప్పుడు కొడుకులు తన మాటని సాగనివ్వకపోయేసరికి చాలా ఉడుకుమోత్తనం వచ్చింది అనసూయమ్మగారికి. కాని ఏం చేస్తారు? తల్లి, కూతురు ఇప్పుడు వాళ్ళ అండన బ్రతుకుతున్నారు. కాబట్టి నోటి మంచితోనే కార్యం సాధించాలి.

"పోనీ దాన్ని కాలేజీలోనైనా జేర్పించండిరా. ఈ రెండు మూడేళ్ళూ అది ఖాళీగా కూర్చోవడమెందుకూ?"

కొడుకుల వైపు ఖరిని అనుమానిస్తూనే అన్నారు అనసూయమ్మగారు.

ఇప్పుడు వాణిని కాలేజీలో చేర్పిస్తే ఫీజులు, పుస్తకాలు—ఈ ఖర్చంతా ఎవరు భరిస్తారు?



శాస్త్రి గయ్యిమని లేచాడు.

"నీకు బుద్ధుందా, లేదా అమ్మా! మన ఇళ్ళల్లో ఆడవాళ్ళెప్పుడైనా బయటకి వెళ్ళడం జరిగిందా! అందులోను వయసొచ్చిన ఆడపిల్ల రోడ్లమీద తిరుగుతూ వుంటే మనకెంత నామర్దా. అది ఇప్పుడు చదివి రాజ్యాలేలక్కర లేదు. ఇంట్లోవుండి ఇంటిపనులు నేర్చుకోమను. ఇంటిపనులు రాకపోతే రేపొద్దున పెళ్ళయ్యాక దాని అత్తవారు దాన్ని, మనల్నికూడా దుయ్యబడతారు."

ఈ మాటలతో కొడుకుల ఆంతర్యాలు క్రమంగా అర్ధమవసాగాయి అనసూయమ్మగారికి.

జరుగుతున్న సంఘటనలన్నింటికి ప్రేక్షకురాలు మాత్రమే వాణి. తన దురదృష్టానికి మాత్రం విచారిస్తూ వుంటుంది.

ఇలాగే మూడేళ్ళు గడిచిపోయాయి. వాణికి ఇరవై ఏళ్ళు నిండిపోయాయి.

ఈ మూడేళ్ళలో—

పెద్ద కోడలు రవ్వల నెక్లెసే కాకుండా రవ్వలగాజులు కూడా చేయించుకుంది.

శర్మ కుటుంబంతో కలిసి ఒకసారి కాశ్మీరువరకు, మరొకసారి కన్యాకుమారి వరకు టూరు వెళ్ళొచ్చాడు.

మూర్తి స్కూటరుమీద పెళ్ళాన్ని కూర్చోబెట్టుకుని వూరిమీద బలాదూరు తిరుగుతున్నాడు.

ఎవరికీ చెల్లెలి పెళ్ళి మీద ధ్యాసలేదు. అనసూయమ్మగారు చెప్పి చెప్పి విసిగిపోయారు.

వాణి కూడా బాగా నిరాశపడిపోయింది. రోజు రోజుకీ కృశించిపోతున్న కూతుర్ని చూసి అనసూయమ్మగారికి మరింత బెంగ పట్టుకుంది.

తన కష్టాన్నంతా తన భర్త ప్రాణస్నేహితుడైన ముకుందరావుగారికి చెప్పుకున్నారు అనసూయమ్మగారు. ముకుందరావుగారు ఆ వూళ్ళో ఒక ట్యుటోరియల్ కాలేజీకి అధిపతి.

తన స్నేహితుడు పోయాక అతని కొడుకులు పెరిగి పెద్దవారయి చేస్తున్న నిర్వాకానికి ఆయన చాలా విచారించేరు.

"మీ కష్టాలకి నేనేం చెయ్యలేకపోయినా ఒక పని చెయ్యగలనమ్మా. మీ వాణికి నా కాలేజీలో ఉద్యోగం ఇవ్వగలను. నా స్నేహితుడి కూతురు కాబట్టి అందరికన్నా కాస్త ఎక్కువ జీతం ఇవ్వగలను." అన్నారు ముకుందరావుగారు.

ఆ మాటలకే పొంగిపోయారు అనసూయమ్మగారు.

కడుపున పుట్టిన కొడుకులు సరిగా చూడకపోయినా తన భర్త స్నేహితుడు పాత స్నేహం గుర్తుపెట్టుకుని ఆ పాటి సాయం చేస్తున్నందుకు ఉబ్బి తబ్బిబ్బయ్యారావిడ.

కాని వాణి ఉద్యోగ విషయంలో మరో పెద్ద యుద్ధం జరిగింది ఆ ఇంట్లో.

"సిగ్గు లజ్జ లేకుండా నలుగురు మగాళ్ళతో కలిసి ఉద్యోగం చేస్తుందా! అది రోడ్డెక్కి ఉద్యోగం చేస్తే మా పరువేం గాను?"—అంటూ ఇంటికప్పంత ఎత్తు ఎగిరాడు పెద్దకొడుకు శాస్త్రి.

"దానికి బుద్ధి లేకపోతే నీకైనా ఉండొద్దా అమ్మా! అది రోడ్డు మీదకెళ్ళి ఉద్యోగం చేసి-రేపొద్దున దాన్ని ఎవడైనా ఏమైనా అంటే దానికి జన్మలో పెళ్ళవుతుందా!"

చెల్లెలి పెళ్ళి చేసెయ్యాలనే నిరంతరం ప్రయత్నం చేస్తున్నవాళ్ళల్లా చెల్లెలికోసం తెగ బాధపడిపోయారు మిగిలిన అన్నదమ్ములిద్దరూ.

"ఓస్....సంబడం.... ఇంక ఉద్యోగాలు చేసి ఊళ్ళేలుతారు కాబోలు తల్లీ, కూతురు!" అంటూ మూతులు ముప్పై విరుపులు విరిచారు ముగ్గురు కోడళ్ళూ.

అయితే ఇక్కడో విషయం....

పెళ్ళి చేస్తే డబ్బు ఖర్చు పెట్టాలి.

కాలేజీలో చేర్పించినా డబ్బు ఖర్చవుతుంది. తనే ఉద్యోగం చేస్తే రాబడేగాని ఖర్చుండదు. కాబట్టి ఒప్పుకోమన్నారు కోడళ్ళు. ఒప్పుకున్నారు కొడుకులు.

అంతా కళ్ళతో చూస్తున్నా ఏమీ అనలేక తమ దురదృష్టాన్ని తల్చుకుని తమలో తాము దుఃఖపడసాగారు అనసూయమ్మగారు, వాణి.

మరో సంవత్సరం గడిచిపోయింది.

అనసూయమ్మగారి చుట్టాల్లో, స్నేహితుల్లో, తెలిసినవాళ్ళల్లో వాణి ఈడు వాళ్ళందరికీ పెళ్ళిళ్ళయిపోయాయి. అంతకన్నా చిన్న పిల్లలకి కూడా అయిపోతున్నాయి.

కూతురి పెళ్ళి ప్రసక్తి తీసుకువస్తే ఈ మధ్య కొడుకులు కొత్త డైలాగొకటి మొదలెట్టారు. "ఉద్యోగం చేస్తోంది కదా! దాని పెళ్ళి దాన్నే చేసుకోమను."

దీనికి కారణం-వాణి తెచ్చిన జీతండబ్బు అన్నదమ్ముల కివ్వనివ్వలేదు అనసూయమ్మగారు. ఆ డబ్బు వాణిపేర బ్యాంకులో వేయిస్తున్నారు. అందుకు ఒళ్ళు మండింది కోడళ్ళకి. వాళ్ళు 'కీ' యిస్తే వచ్చిన డైలాగు ఇది.

వాళ్ళ నీచత్వానికి అసహ్యమేసింది అనసూయమ్మగారికి

ఇదిలా వుండగా వాళ్ళ ఇంటికి ఎదురుగా అద్దెకు దిగాడు హనుమంతు.

హనుమంతు ఆ పేటకు పెద్ద రౌడీ.


సులభముగా ఇంగ్లీషు మాట్లాడుటకు




బాలాజీస్ ఈసీ వే టు స్పీక్ ఇంగ్లీష్

బడిలో చదువుకునే విద్యార్థినీ, విద్యార్థులకు, ఇంగ్లీషు చదివినా కూడా వ్యాకరణ సంశయము గలవారికి, వ్యాకరణ దోషములు లేకుండా సరళముగా ఇంగ్లీషు మాట్లాడుటకు, వ్రాయుటకు, నేర్పించుటకు ఉపకరించే పుస్తకం!

ఉద్యోగులు, వ్యాపారస్థులు, ఇంగ్లీషులో ఎక్కువ పరిజ్ఞానము లేనివారికి తెలుగుద్వారానే వ్యాకరణబద్ధంగా ఇంగ్లీషు నేర్చుకొనుటకు ఇది ఒక మంచి సాధనము!

ఈ పుస్తకం చదవడం ప్రారంభించగానే మీతోబాటుగా ఒక ఉపాధ్యాయుడు తోడున్నట్లే భావించగలరు!

మీ ఊరిలోని అన్ని బుక్‌షాపుల లోను లభిస్తుంది. వెల.రూ.19-50

వివరములకు: బాలాజీ పబ్లికేషన్స్
103 పైక్రాఫ్ట్స్‌రోడ్, మద్రాసు-600 014.

BALAJI PUBLICATIONS
103 PYCROFTS ROAD
MADRAS 600 014

కాలేజి చదువు వెలగబెడ్తున్నాడని చెప్పుకుంటూ వుంటారు. డిస్కో-పాంటు టక్ చేసి బెల్టు బిగిస్తాడు. ఆ బెల్టు దెబ్బలాటలు వస్తే ఉపయోగపడడానికి. ఉంగరాల జుత్తు, నోట్లో సిగరెట్టు- ఈ రెండింటికి ఏమిటి సంబంధం అని చూసేవాళ్ళకి అనిపించవచ్చు. ఈ రెండూ ఆడపిల్లలు కనిపిస్తే పోజు కొట్టడానికి. కుడిచేతి మణికట్టుకి రంగుల రుమాలు చుట్టుకొని వుంటాడు— అది ఆడపిల్లల్ని ఏడిపించడానికి.

హనుమంతు ఆ వీధిలోకి వచ్చాక ఆ వీధిలో ఆడవాళ్ళెవరూ బైటికి రావడానికి సాహసించలేకపోతున్నారు. వాళ్ళు వెళుతున్నప్పుడు అతను.అతని మిత్రబృందము విసిరే కామెంట్సుకి, జోక్సుకి మర్యాదగల ఆడవాళ్ళెవరూ తలెత్తుకుని తిరగలేకపోతున్నారు.

ఇటువంటి పచ్చి రౌడి (రౌడీల్లో పచ్చి రౌడి పండురౌడి అని వుంటారా అని అనుకోకండి) హనుమంతుకి ఇంటికి యెదురుగా బంతిపువ్వులా వున్న వాణి కంట బడడం ఆశ్చర్యం కాదు.అతను వాణి వెంట బడడం అంతకన్నా ఆశ్చర్యం కాదు.

"పిట్ట పిటపిట లాడుతోందిరోయ్."

ఎవడో కూసేడు.

"ఎవడిదో అదృష్టం "

మరొకడు వంత కూసేడు.

"ఇంకెవడిదిరా నాదే ఆ అదృష్టం."

వెకిలిగా నవ్వుతూ వాణిని చూసి కన్ను కొట్టాడు హనుమంతు. వాణి తల వాలిపోయింది.

ఇది హనుమంతు వాణిని పెట్టే అల్లరికి ఒక మచ్చుతునక మాత్రమే.

వాణికి రోజూ కాలేజీకి వెళ్ళిరావడం ఒక గండం అయిపోతోంది. హనుమంతు విసిరే మాటలకి వాణే గాకుండా విన్నవాళ్ళంవరూ సిగ్గుతో కుంచించుకుపోతున్నారు. ఆ ఇంట్లో వాణికే గాకుండా- అనసూయమ్మగారికి, ముగ్గురు కోడళ్ళకి కూడా అతనొక తలనొప్పి అయిపోయాడు.

తన భార్య నేదో అన్నాడని మూర్తి మందలించబోతే చేతులకి, కాళ్ళకి బ్యాండేజి కట్టించుకోవలసి వచ్చిందతను.

హనుమంతు ఆగడాలు భరించలేక పోలీసు రిపోర్టిచ్చాడు మూర్తి. కాని ఎవరూ హనుమంతుమీద ఏవిధమైన యాక్షనూ తీసుకోలేదు. అందుకు కారణం హనుమంతు మేనమామ డీయస్పీ కావడమే! ఆ సంగతి మూర్తికి తెలీదుగదా మరి! పోనీ ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోదామంటే అది వాళ్ళ స్వంత ఇల్లు.

ఇదిలా వుండగా వాణి పరిస్థితి మరీ దుర్భరంగా వుంది. కాలేజీకి వెళ్ళడం మానేసింది. బైటికి రావడం కూడా మానేసుకుంది.

అనసూయమ్మగారు మరి సహించలేక పోయారు.

"ఏమర్రా! మీకు సిగ్గులేవూ! వయసొచ్చిన ఆడపిల్లని ఇంట్లో పెట్టుకుని మీరు పెళ్ళాలతో కులుకుతున్నారు. ఇప్పుడది మీకే గాక ఊళ్ళో వాళ్ళకి కూడా లోకువయింది. ఎదురింటి రౌడీగాడు దాన్ని పెట్టే బాధలకి, అనే మాటలకి అది ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటే ఏం చేస్తారు! ఇంట్లో ఎవళ్ళూ లేకపోవడం చూసి వాడు దాన్నేమైనా చేస్తే అప్పుడు మీ పరువు, మర్యాద లేమవుతాయి? మీకు చేవవుంటే ఆ రౌడీ గాణ్ని ఇక్కడ్నుంచి తగిలెయ్యండి. లేదా వాణికి తొందరగా పెళ్ళయినా చేసెయ్యండి. అంతదాకా నేనీ ఇంట్లో పచ్చి గంగైనా ముట్టుకోను."

అనసూయమ్మగారు నిరశన వ్రతం ప్రారంభించేరు.

హనుమంతుని ఆ వీధిలోంచి పంపడం తమ వల్లకాదు. ఇంతకుముందొకసారి ఆ ప్రయత్నం చేసి భంగపడ్డారు. ఇంట్లో తల్లి పోరు భరించలేకుండా వున్నారు. అంతే గాదు, తల్లి చెప్పినట్లు వాడసలే దుర్మార్గుడు. వాణినేమైనా చేస్తే అది తమ కుటుంబానికే అప్రదిష్ట.

ముగ్గురన్నదమ్ములూ ఇక లాభంలేదని ఒక నిర్ణయాని కొచ్చేశారు.

సరిగా నెల తిరిగేసరికి వాణికి పెళ్ళయి అత్తారింటికి వెళ్ళిపోయింది.

అప్పగింతలప్పుడు అందరి తల్లుల్లాగా అనసూయమ్మగారు ఏడవలేదు. పైగా తన కూతురి బ్రతుకు ఒక ఒడ్డున పడినందుకు చాలా సంతోషించారు కూడా!

* * *

పెళ్ళి హడావుడి అయిపోయింది. చుట్టాలందరూ వెళ్ళిపోయారు. కొడుకులు, కోడళ్ళు, పిల్లలు— అంతా కలిసి ఎక్కడికో వెళ్ళారు. ఇంట్లో అనసూయమ్మగారొక్కరే వున్నారు.

ఇంతలో వీధి తలుపు చప్పుడయింది.

అనసూయమ్మగారు వెళ్ళి తలుపుతీశారు.

ఎదురుగా కనిపించిన మనిషిని చూసి మరొకరయితే భయపడేవారేగాని అనసూయమ్మగారు భయపడలేదు.

"రా నాయనా" అంటూ చిరునవ్వుతో అతన్ని లోపలికి ఆహ్వానించారు.

"రమ్మని కబురు చేశారుట" అంటూ అతను వినయంగా లోపలి కొచ్చాడు.

అనసూయమ్మగారు చూపించిన కుర్చీలో ఒదిగి కూర్చున్నాడు.

అనసూయమ్మగారు పెళ్ళిలో చేసిన నాలుగు లడ్లు, కొంచెం బూంది ఒక పళ్ళెంలో పెట్టి తీసుకువచ్చేరు.

"ఇప్పుడివన్నీ ఎందుకండీ!"

మొహమాటపడ్డాడతను.

"ఫర్వాలేదు తిను నాయనా. నీ కేమిస్తే నీ ఋణం తీర్చుకోగలను నేను. కనీసం నాచేత్తో ఈ ఫలహారమైనా పెట్టనియ్యి-"

అంటూ మరికొంచెం బూంది అతని ప్లేట్లో వేసి ఫ్లాస్కులో కాఫీ గ్లాసులోకి వంచి అతని దగ్గర పెట్టేరు.

"నాదేముందండి. అంతా మీ రాడమన్న నాటకం. దానివలన మీ అమ్మాయిపెళ్ళి జరిగింది. నాకదే సంతోషం."

అనసూయమ్మగారు పెట్టిన ఫలహారం తిని, కాఫీ తాగి "వస్తానమ్మా" అంటూ సెలవుతీసుకుని వెళ్ళిపోయాడతను.

అతను వెళ్ళిన వేపే కన్నీళ్ళతో చూస్తూ కూర్చుండిపోయారు అనసూయమ్మగారు.

ఆ వచ్చి వెళ్ళినతనెవరో వూహించారు కదూ — ఆ పేటకల్లా పచ్చి రౌడీ హనుమంతు.

